ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 21-10.2025 సమయం : 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.
2. ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు.
3. జుబ్లీహిల్స్ శాసన సభా స్థానం ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు నామినేషన్లు దాఖలు చేయడానికి ఈరోజుతో గడువు ముగియనుంది.
4. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈరోజు నుంచి నాలుగు రోజులపాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ విభాగం తెలియజేసింది.

------------------

**Police Flag Day:**

రాష్ట్రంలో అసాంఘిక కార్యకలాపాలు పెరగనివ్వకుండా అహర్నిశలు శ్రమిస్తూ తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మావోయిస్టు ఉద్యమంలోని అజ్ఞాత నాయకులు జనజీవన స్రవంతిలో కలిసిపోయి.. దేశాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని ముఖమంత్రి పిలుపునిచ్చారు.

**(Soundbyte- CM on Maoists)**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా, హైదరాబాద్ గోషామహల్ వద్ద పోలీసు అమరవీరుల స్మారకం వద్ద ముఖ్యమంత్రి పోలీసు అమరవీరులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతి భద్రతల నిర్వహణలో

పోలీసులు అందిస్తున్న సేవలను కొనియాడారు. టెక్నాలజీ రూపంలో ఎదురవుతున్న సవాళ్లకు రాష్ట్ర పోలీసులు టెక్నాలజీతోనే సమాధానం చెబుతున్న తీరును ముఖ్యమంత్రి ప్రశంసించారు. 2008 లో ఒరిస్సాలో మావోయిస్టుల దాడిలో మరణించిన 33 మంది పోలీస్ కుటుంబాలకు గాజుల రామారంలో 200 గజాల స్థలాన్ని కేటాయించినట్లు చెప్పారు.

(**Soundbyte - CM on Welfare**)

రాజకీయ జోక్యం లేకుండా పోలీసులు స్వేచ్ఛగా విధులు నిర్వర్తించే పరిస్థితులు తమ ప్రభుత్వం కల్పించిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**MSL**

-----------------------------

**దినం**

ఈరోజు పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని జరుపుకుంటున్నారు. 1959 లో ఇదే రోజున 21 మంది సీఆర్పీఎఫ్ సైనికులు చైనా సరిహద్దుల్లోని ఆక్సాయ్ చిన్ ప్రాంతంలో 16 వేల అడుగుల ఎత్తున రక్తం గడ్డకట్టే మంచు పర్వతాల మధ్య హాట్ స్ప్రింగ్స్ వద్ద విధుల్లో ఉండగా చైనా సైనికులు సియాచెన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో మన బృందం ఎదురొడ్డింది. ఆ పోరాటంలో పది మంది భారత జవాన్లు ప్రాణాలను కోల్పోయారు.

**డెస్క్**

---------------------

**పోలీసు ఫ్లాగ్ డే: MoS**

పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఢిల్లీ చాణిక్యపురిలోని జాతీయ పోలీస్ స్మారక స్థూపం వద్ద విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల అమర వీరులకు నివాళి అర్పించారు. రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి శ్రద్ధాంజలి ఘటించారు.

**MSL**

---------------------

**అమరవీరులు**

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అమర పోలీసులకు ఘనంగా నివాళులర్పించారు.

సమాజంలో ప్రజల మాన ప్రాణ రక్షణలో పోలీసులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.

పోలీసుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు నివాళులర్పించారు.

వరంగల్ లో జరిగిన కార్యక్రమంలో అమరులకు పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ నివాళులర్పించారు.

కరీంనగర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో పోలీస్ అమవీరుల స్థూపం వద్ద నిర్వహించిన పరేడ్ లో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం గౌరవ వందనం స్వీకరించారు.

శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల ప్రాణ త్యాగాలను ఎప్పటికీ మర్చిపోలేమని రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసు సూపరింటెండెంట్ మహేష్ బి గితే పేర్కొన్నారు.

ప్రజల మాన ప్రాణ రక్షణకు కృషి చేస్తున్న పోలీసులను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ అన్నారు.

ములుగు జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ అమర పోలీసులకు నివాళులర్పించారు.

గత ఏడాది వర్షాలు వరదల సమయంలో 24 గంటలు పోలీసులు విధులు నిర్వహించి ప్రజల ప్రాణాలు కాపాడారని మహబూబాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు.

పోలీసు అమరవీరుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు.

**పీటీసీ సంగారెడ్డి, సిరిసిల్ల, వనపర్తి, భద్రాద్రి, సిద్దిపేట, మహబూబాబాద్, జగిత్యాల, నల్గొండ, వరంగల్, కరీంనగర్, ములుగు**

------------------------

**జూబ్లీ హిల్స్:**

జూబ్లీ హిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్, పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి, వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్ లు హైదరాబాద్ చేరుకున్నారు. ఉప ఎన్నిక నిర్వహణ ప్రణాళికను జిల్లా ఎన్నికల అధికారి, GHMC కమిషనర్ RV కర్ణన్ వివరించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఉప ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఇలా ఉండగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నామినేషన్లు దాఖలు చేసేందుకు ఈ రోజుతో గడువు ముగుస్తోంది. ఈ నెల 24 వరకు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు గడువు ఉంది. నిన్నటి వరకు 94 మంది నాముసేషన్లు దాఖలు చేశారు.

**MSL**

-----------------------

**రియాజ్**

నిన్న ఎన్కౌంటర్ లో మృతి చెందిన రౌడీ షీటర్ రియాజ్ మృతదేహానికి నిజామాబాద్ జిజిహెచ్ ఆసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం పూర్తి చేసి ఈ తెల్ల వారు జామున పోలీసు బందోబస్తు నడుమ కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని పోలీసులు అప్పగించారు. బోధన్ రోడ్డులో గల స్మశాన వాటికలో రియాజ్ మృతదేహానికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు. తప్పని సరి పరిస్థితుల్లోనే రియాజ్ పై పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చిందని నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సాయి చైతన్య స్పష్టం చేశారు.

**పీటీసీ మంచిర్యాల**

---------------------------

**ఆర్బీఐ**

మన దేశ ఆర్థిక వ్యవస్థ అధిక వృద్ధిని నమోదు చేయడానికి సిద్ధంగా ఉందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ తెలియజేసింది. సామర్థ్య వినియోగం, దేశీయ డిమాండ్ సూచికలు మెరుగుదలను సూచిస్తున్నాయని ఆర్‌బిఐ నిన్న విడుదల చేసిన బులెటిన్ లో పేర్కొంది. తయారీ, సేవల ప్రధాన సూచికలు బలమైన విస్తరణను చూపుతూనే ఉన్నాయని, ద్రవ్యోల్బణం లక్ష్య రేటు కంటే చాలా తక్కువగా ఉందని ఆర్‌బిఐ తెలిపింది.

**ఎస్ఎస్డీ**

----------------------------

**సరీసృపాలు**

ఈరోజు జాతీయ సరీసృపాల అవగాహన దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. పాములు, బల్లులు, తాబేళ్లు, మొసళ్లు మొదలైన సరీసృపాల ప్రాముఖ్యతను గుర్తించడానికి, వాటికి సంబంధించిన అపోహలను తొలగించడానికి, పర్యావరణ వ్యవస్థలో వాటి పాత్ర గురించి

అవగాహన పెంచడానికి, వాటిని సంరక్షించే ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడానికి ఈరోజు ఉద్దేశించబడింది. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో సరీసృపాలు కీలక పాత్ర పోషిస్తాయి.

**డెస్క్**

-------------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో ఈరోజు నుంచి నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. దక్షిణ అండమాన్ సముద్రం, దాని సమీపంలోని ఆగ్నేయ బంగాళాఖాతం ప్రాంతంలో ఉపరితల చక్రవాత ఆవర్తనం ఏర్పడిందని, దీని ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతం ప్రాంతంలో రాగల 12 గంటల్లో ఒక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

**పీఎస్**

---------------------------

**ఫౌజ్**

ఈరోజు ఆజాద్ హింద్ ఫౌజ్ దినోత్సవం. 1943 అక్టోబర్ 21న సుభాష్ చంద్రబోస్ సింగపూర్‌లో "ఆజాద్ హింద్" అనే తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రోజును ఇది సూచిస్తుంది. ఇండియన్ నేషనల్ ఆర్మీగా పిలుచుకున్న ఆజాద్ హింద్ ఫౌజ్ దళం రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటిష్ పాలన నుండి భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకురావాలనే లక్ష్యంతో స్థాపించబడింది.

**డెస్క్**

---------------------------

**వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా దీపావళి పర్వదినం సందర్భంగా నిన్న రాత్రి ఘనంగా జరుపుకున్నారు. దుకాణాలలో ధనలక్ష్మి పూజలు నిర్వహించారు. బాణ సంచాలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో రాత్రి ధనలక్ష్మి పూజ అనంతరం, నరకాసురవధ కార్యక్రమాన్ని నిర్వహించారు. హంస వాహనంపై స్వామివార్లను ఊరేగించారు.

**పీటీసీ సిరిసిల్ల**

---------------------------